

హైదరాబాద్ వార్త

# ఏం చేద్దాం.. ఎలా ముందుకెళ్దాం!

**- దానం వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ అంతర్మధనం - స్పీకర్ వద్ద ఇప్పటికే రాజీనామా లేఖ**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో దానం నాగేందర్(పాతచిత్రం)

**జూబ్లీహిల్స్, నవంబరు 20, ప్రభాతవార్త:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీకి మరో చిక్కు వచ్చి పడింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంపై ఇప్పటికే కోర్టులో, స్పీకర్ ముందు కొనసాగుతుంది. నిర్ణీత గడుపులోపు నిర్ణయం తీసుకోవాలంటూ తాజాగా కోర్టు స్పీకర్‌పై ఘాటుగా వ్యాఖ్యానించడంతో ఇప్పుడు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారం తెరమీదకొచ్చింది. మిగిలిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినప్పటికి అధికారికంగా ఎక్కడ వ్యవహరించడం లేదు. అయితే దానం నాగేందర్ బీఆర్ఎస్ బీఫారంపై ఎమ్మెల్యేగా గెలుపొంది తదనంతరం కాంగ్రెస్ పార్టీలోకి మారి కాంగ్రెస్ పార్టీ అందించిన బీఫారంపై సికింద్రాబాద్ ఎంపీగా బరిలో నిలిచారు. కాంగ్రెస్ బీఫారం మీద పోటీ చేయడంతో దానం నాగేందర్ పార్టీ ఫిరాయించినట్లు తేటతెల్లమైంది. అయితే దానంపై అనర్హత వేటు వేస్తే దాదాపు ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండదు. దీంతో దానంను రాజీనామా చేయించాలనే ఆలోచనలో ఇప్పటికే కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించి పార్టీ కీలక నేతలు ఢిల్లీ పెద్దలతోనూ చర్చించినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా అనర్హత వేటు పడకుండా తప్పించుకొనేందుకు ఇప్పటికే దానం నాగేందర్ స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా లేఖను సిద్ధం చేసి స్పీకర్ ముందు ఉంచినట్లు తెలుస్తుంది. ఒకవేళ వేటు పడే అవకాశం ఉండి ఆయా పత్రాలు తన చేతికి రాకముందే స్పీకర్ ఆయా రాజీనామా పత్రాన్ని ఆమోదింపజేసే అవకాశం ఉందని పార్టీలోకి కొందరు ముఖ్య నాయకులు చెబుతున్నారు. మరోవైపు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మెజార్టీ ఓట్లతో విజయం సాధించారు. కాగా ఇదే ఫార్ములా, ఫార్మాట్‌తో ఇప్పుడు దానంను ముందుగానే రాజీనామా చేయించి బరిలో నిలపాలని భావిస్తున్నారు. తద్వారా మరో సీటును అధికారికంగా కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవచ్చని భావిస్తున్నారు.

**దానంకు ఎమ్మెల్సీ అవకాశాలపై పరిశీలన**

ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అనుసరించిన విధానాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గంలోనూ అనుసరించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత, క్రికెటర్ అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీని ఇచ్చి తద్వారా మంత్రిని చేశారు. అదే సమయంలో స్థానికుడైన నవీన్‌యాదవ్‌కు అవకాశం కల్పించి మెజార్టీతో గెలిపించారు. ఇదే రీతిలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోనూ దానం నాగేందర్‌కు ఎమ్మెల్సీని తద్వారా బీసీ నేతగా ఆయనకు మంత్రి పదవిని ఇవ్వాలని ఆలోచిస్తున్నారు. అదే సమయంలో పీజేఆర్ వారసురాలిగా టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ విజయారెడ్డికి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిపి గెలిపించాలని పార్టీ మరో కోణంలో భావిస్తుంది. తద్వారా పీజేఆర్ వారసత్వాన్ని కొనసాగించడంతోపాటు మహిళకు అవకాశం, బీసీ నేతకు మంత్రి పదవి ఇవ్వవచ్చనే ఆలోచన చేస్తున్నారు. దీనికితోడు నగరంలో రెండు మంత్రి పదవులు ఇవ్వడం వల్ల రానున్న రోజుల్లో నగరంలోనూ కాంగ్రెస్ పార్టీ తన ప్రాబవాన్ని పెంచుకోవాలని భావిస్తుంది. ఇందుకోసం ఇప్పటికే దానంతోనూ పార్టీ వర్గాలు చర్చించినట్లు తెలుస్తుంది. వారం, పది రోజుల్లో దానం వ్యవహారంలో పార్టీ ఒక నిర్ణయం తీసుకొనే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

## కొనసాగుతున్న స్టేషన్ పునరాభివృద్ధి పనులు

**-రూ. 26.50 కోట్ల వ్యయంతో మలక్‌పేట అమృత్ రైల్వే స్టేషన్ పనులు**
**-ఆధునిక హంగులతో శరవేగంగా పనులు షురూ**



మలక్‌పేట్ స్టేషన్ నమూనా

**తార్నాక, నవంబర్ 20 ప్రభాతవార్త :** అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 40 రైల్వే స్టేషన్లను సుమారు. రూ. 2.750 కోట్ల అంచనా వ్యయంతో కేంద్ర ప్రభుత్వం పునరాభివృద్ధి పనులను చేపడుతున్నారు. అందులో భాగంగా ఆయా రైల్వే స్టేషన్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున చేపడుతున్నారు. అందులో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అదేవిదంగా నగరంలోని బేగంపేట్, వరంగల్, కరీంనగర్ వంటి మూడు రైల్వే స్టేషన్లను ప్రధాన మంత్రి నరేంద్ర వమోది ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎప్పటికప్పుడు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా వివిధ కీలక అంశాల అభివృద్ధి చేయాలనే ఆలోచనతో మాస్టర్ ప్లాన్ ప్రకారం రూపొందించి అమలు పరచడం ప్రభుత్వం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. మలక్‌పేట రైల్వే స్టేషన్‌కు రోజు రోజుకు ప్రయాణికుల తాకిడి పెరుగుతోంది. రద్దీని దృష్టిలో పెట్టుకొని స్టేషన్లను డెవలప్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా హైదరాబాద్ నగరంలో ఎన్నో ఏండ్ల చరిత్ర కలిగిన మలక్ పేట అమృత్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులను శరవేగంగా కొనసాగిస్తున్నారు.



కొనసాగుతున్న పునరాభివృద్ధి పనులు

## నూతన జాతీయ విద్యావిధానం 2020పై అవగాహన కల్పించాలి

**-యూజిసి మాజీ చైర్మన్ ప్రొ.జగదీష్**



మాట్లాడుతున్న యూజీసీ మాజీ చైర్మన్ ప్రొ.జగదీష్

**తార్నాక, నవంబర్ 20 ప్రభాతవార్త :** నూతన జాతీయ విద్యావిధానం 2020 (ఎన్ఈపీ2020) ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని యూజీసీ మాజీ చైర్పర్సన్ ప్రొఫెసర్ జగదీష్ కుమార్ సూచించారు. దానిని ఏ విధంగా ఆచరణలోకి తీసుకురావాలో వివరించారు. అఖిల భారతీయ రాష్ట్రీయ్ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎమ్), వాయిస్ ఆఫ్ హైదరాబాద్ అకాడమీషియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో తార్నాకలోని ఐసీటీ ఆడిటోరియంలో ఎన్ఐపీ 2020: ఇంప్లిమెంట్, మెజర్, ఇంప్రూవ్ అనే అంశంపై జాతీయ సదస్సు గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా ప్రొఫెసర్ జగదీష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఈపీ అమలులోకి వచ్చిన తరువాత పరిస్థితి ఎలా ఉందో సోదాహరణంగా వివరించారు. భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి గుంతా లక్ష్మణ్, వాయిస్ ఆఫ్ హైదరాబాద్ అకాడమీషియన్స్ కన్వీనర్ డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ యాదయ్య, ప్రొఫెసర్ కిషన్, ప్రొఫెసర్ కవిత పాల్గొన్నారు.

## ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

**-పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలి**
**-కలెక్టర్ హరిచందన దాసరి**



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి,డిఈవో రోహిణి తదితరులు

**హైదరాబాద్,నవంబర్ 20,ప్రభాతవార్త:** విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా నాణ్యమైన విద్యాబోధన అందాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఎన్. బి.టి లోని ప్రైమరీ, ఉన్నత పాఠశాలు కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్య బోధన అందించడంతో పాటు సమయానికి నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. ప్రైమరీ, ఉన్నత పాఠశాలలు, భవిత కేంద్రాన్ని అలాగే క్రీడ మైదానాన్ని కలెక్టర్ సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసారు.అలాగే ప్రైమరీ,ఉన్నత పాఠశాలలు, భవిత సెంటర్‌లో పిల్లలతో పాటు ఉపాధ్యాయులు సంఖ్య, అందుతున్న విద్య బోధన తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల తరగతి గదులు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి, పిల్లలకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని, పరీక్షలు సమయం సమీపిస్తున్న తరుణంలో ఉత్తీర్ణత శాతం మెరుగు పర్చుటకు ప్రత్యేక క్లాసులను నిర్వహించి, పిల్లలలో ఏకాగ్రతను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రైమరీ పాఠశాలలోని గోడపై కలర్స్ లతో ఉన్న వివిధ రకాల ఆర్ట్స్ ను పరిశీలించి, పిల్లలతో ముఖాముఖిగా ముచ్చటించారు. అలాగే సబ్జెక్టులలో గల సిలబస్ పూర్తిగా అయ్యాయా లేదా అడిగి తెలుసుకున్నారు.అలాగే ఉపాధ్యాయులతో మధ్యాహ్న భోజనం వివరాలపై అడిగి తెలుసుకొని విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. పరీక్షల సమయము దగ్గర పడుతున్నందున విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి, సబ్జెక్టులపై ఏకాగ్రత ఉంచాలని అలాగే ప్రతి ఒక్కరు ఉత్తీర్ణులు అయ్యే విధంగా కష్టపడాలని పిల్లలకు ఆమె ఉద్బోధించారు,ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, హెచ్ఎం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మొండిబకాయిల వసూలుకు ఓటీఎస్

**-స్పోర్ట్స్‌కాంప్లెక్స్‌ల నిర్వహణ ప్రైవేట్‌కు..**
**-రూ.5కోట్లతో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్**
**-స్వచ్ఛ ఆటోలు, స్వీపింగ్ వాహనాలన్నింటికీ జిపిఎస్ సిస్టం**
**-జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీలో18 అంశాలు 6టేబుల్ ఐటంలకు ఆమోదం**



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్,నవంబర్ 20,ప్రభాతవార్త:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వన్ టైమ్ స్కీమ్(ఓటీఎస్) స్కీమ్ ని అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ప్రభుత్వ అనుమతి కొరకు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ప్రాపర్టీ ట్యాక్స్ మొండి బకాయిలను రాబట్టేందుకు ప్రతిఏటా అమలు చేస్తున్న ఈ ఓటీఎస్ని ఈ సారి కూడా అంబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటుంది. దీంతో చాలా కాలంగా ప్రాపర్టీ టాక్స్ బకాయిలు ఉన్నవారికి ఓటీఎస్ కింద వడ్డీలో 90శాతం రాయితీ కల్పించేందుకు అవకాశం ఇవ్వనుంది. ఈమేరకు గురువారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ మీటింగ్ జరిగింది. దీనికి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఇతర అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా సర్కిల్ 17 లోని 100వ వార్డు సనత్‌నగర్ లో జెన్ టెక్నాలజీస్ ఇండస్ట్రియల్ ఏరియా ఎదురుగా నీరు నిలవకుండా చూసేందుకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదించింది. ప్రస్తుత ఒవైసీ జంక్షన్ ఫ్లైఓవర్ నుండి సంతోష్ నగర్ వైపు ఎడమ వైపునకు 30 మీటర్ల నుండి 32.5 మీటర్లు 45 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదిత నిర్మాణం కోసం రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఆమోదించింది. హెచ్‌సిటీ కింద ప్రతిపాదిత 30 మీటర్లు 15 మీటర్ల నుండి 20.5 మీటర్ల వెడల్పు గల 4- లేన్ యూనిడైరెక్షనల్ రసూల్ పుర జంక్షన్ నిర్మాణం కోసం సవరించిన రోడ్డు అభివృద్ధి ప్రణాళిక ఆమోదం కోసం అభ్యర్థన 26 ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి వీలుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నుండి ఆమోదం పొందడానికి కమిటీ ఆమోదం. అలాగే కూకట్‌పల్లి జన్‌లోని మూసాపేట్ సర్కిల్‌లోని వార్డ్ నెం.114, కెపిహెచ్‌బి కాలనీలోని 4వ దశలో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లోని ఒక భాగంలో ప్రాథమిక ఆహార పరీక్షా ప్రయోగశాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని రూ.5 కోట్ల మంజూరు కోసం కార్పొరేషన్ అనుమతికి సిఫార్సు చేసి, పరిపాలనా అనుమతికి విజ్ఞప్తి. ఫలక్‌నుమాలో ఉన్న ప్రస్తుత బ్రాడ్‌గేజ్ లైన్ ఆర్‌ఓబీకి సమాంతరంగా మరో ఆర్‌ఓబీ నిర్మాణానికి సవరించిన పరిపాలనా ఆమోదం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రధాన రోడ్డు అభివృద్ధి పథకం కింద అదనపు వ్యయం కోసం అనుమతి. బల్కంపేట్ టెంపుల్ రోడ్ నుండి సనత్‌నగర్ వరకు ఉన్న ఫతేనగర్ ఫ్లైఓవర్ పునరుద్ధరణ పనులకు పరిపాలనా ఆమోదంరాటిఫికేషన్ కోసం అనుమతి, ఖైరతాబాద్ జోన్‌లోని 10 క్రీడా సముదాయాల నిర్వహణ, కార్యకలాపాల కోసం టెండర్లను ఆహ్వానించేందుకు అనుమతి. శేరిలింగంపల్లిలోని ఖాజాగూడా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను మరమ్మతులు/నిర్వహణ కోసం ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చే ప్రతిపాదన. అలాగే గేమ్స్ ఇన్‌స్పెక్టర్ ఓ. వీరానందను అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్‌గా పదోన్నతి చేసి స్పోర్ట్స్ విభాగంలో పోస్టింగ్ చేయడం. ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంతో 4 సంవత్సరాల పిఎండబ్ల్యూసహాయ ఒప్పందం. సికింద్రాబాద్ జోన్‌లో సర్కిల్స్ 12, 13, 14, 17,18 లో పరిశుభ్రత నిర్వహణ కోసం ప్రత్యేక ఏజెన్సీలతో 1 సంవత్సరపు ఒప్పందానికి ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను ఆహ్వానించేందుకు నిధులు మంజూరు చేయడానికి అనుమతి. అలాగేజిహెచ్ఎంసి ఆదాయం, వ్యయాల స్టేట్‌మెంట్ స్టాండింగ్ కమిటీకిఅందజేయడం వంటి మొత్తం 18 అంశాలను కమిటీ ఆమోదించింది అలాగే 6 టేబుల్ ఐటెంలలో అబిడ్స్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 56 సెల్లార్ దుకాణాల కోసం టెండర్ ప్రక్రియకు అమోదం. కుత్బుల్లా పూర్ సర్కిల్ ఆఫీస్ ప్రాంగణంలో ఉన్న భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ లీజ్‌ను మరో 3ఏళ్లు పొడిగించడానికి అమోదం జిహెచ్ఎంసి వాహనాల ( స్వచ్ఛ ఆటో లు, స్వీపింగ్ వాహనాలు, ఫాగింగ్ వాహనాలు)వంటి కోసం జిపిఎస్ ఆధారిత వాహన ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి నిర్వహించేందుకు సర్వీస్ ప్రొవైడర్‌ను ఎంపిక చేయడానికి ఆమోదం తెలిపింది. ఈసమావేశంలో జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, మహ్మద్ సలీం, డా.ఆయేషా హుమేరా, మహాలక్ష్మి రామన్ గౌడ్, సి.ఎన్.రెడ్డి, మహమ్మద్ బాబా ఫసియుద్దీన్, బూరుగడ్డ పుష్పలు పాల్గొన్నారు.

## బోరబండ స్మశాన వాటిక భూవివాద పరిష్కారానికి సమావేశం



మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నవీన్‌యాదవ్, ఫహీం ఖురేషీ తదితరులు

**జూబ్లీహిల్స్, నవంబరు 20, ప్రభాతవార్త:** బోరబండ స్మశాన వాటికకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న భూవివాదాన్ని పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ నేపథ్యంలో సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యను సమగ్రంగా సమీక్షించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూబ్లీహిల్స్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన నవీన్ యాదవ్, టీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు ఫహీం ఖురేషీ, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆధ్వర్యంలో బోరబండ ముస్లిం వెల్ఫేర్, గ్రేవ్‌యార్డ్ కమిటీ సభ్యులను కలుసుకుని, భూవివాదాన్ని త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో బోరబండలో స్మశానవాటికకు స్థలం కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకొచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ముందే భూమిని కేటాయిస్తున్నట్లు నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే ఈ స్థలం వ్యవహారంలో కొంత వివాదం తలెత్తడంతో రాజకీయంగా ఇబ్బందులు తలెత్తాయి. కాగా స్మశాన వాటికకు స్థలం కేటాయింపు విషయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపొందిన నవీన్‌యాదవ్ మంత్రి పొంగులేటి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో పొంగులేటి ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు గౌరవప్రదమైన శ్మశాన స్థలాలు, కమ్యూనిటీ అవసరాల పరిరక్షణ పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు. సంబంధిత విభాగాల సమన్వయంతో భూమి సమస్యను త్వరగా పరిష్కరించేలా చర్యలు వేగవంతం చేయనున్నట్టు అధికారులు తెలిపారు. తద్వారా బోరబండ శ్మశాన వాటిక భూసమస్యను పరిష్కరించి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిని నిలుపుకోవాలని భావిస్తున్నారు.

## 23నాటికి సుందరీకరణ పనులు పూర్తి చేయాలి

**మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**



పనులు పరిశీలించి అధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

**హైదరాబాద్,నవంబర్ 20,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి ప్రధాన కార్యాయలంలో చేపట్టిన సుందరీకరణ పనులు ఈనెల 23నాటికి పూర్తిచేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం పనులను పరిశీలించారు.ఫౌంటైన్, ల్యాండ్ స్కేపింగ్, గాంధీజీ, డా బి ఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, పెయింటింగ్ పనులు, నూతన బోర్డ్ ఏర్పాటు తదితర పనులను పరిశీలించారు.25న జీహెచ్ఎంసీ జనరల్ బాడీ మీటింగ్ రోజున సుందరీకరణ పనులను ప్రారంభించాల్సి ఉన్నందున పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి 23 కల్లా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు దిగితే తోలు తీస్తాం

**-సిపి సజ్జనార్ మాస్ వార్నింగ్**



**హైదరాబాద్ నవంబరు 20 ప్రభాతవార్త** తెలంగాణలో విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై ఎవరికైనా దాడులు చేయడం, బెదిరింపులకు దిగడం లేదా వారి విధులకు ఆటంకం కలిగించడం తీవ్రమైన నేరమని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను సీపీ సజ్జనార్ ఖండించారు.ఇటీవలి ఘటనలను దృష్టిలో ఉంచుకొని, చట్టం ముందు అందరూ సమానులని, ప్రభుత్వ యంత్రాంగం పనిచేయడాన్ని అడ్డుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది సహా ఏ ప్రభుత్వ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నప్పుడు వారిని అడ్డుకోవడం, మాటల బెదిరింపులకు దిగడం, దాడి చేయడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలని..ఈ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై భారత న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని 221, 132, 121(1) సెక్షన్ల కింద వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే హిస్టరీ షీట్లు కూడా తెరుస్తాం అని ఆయన ఎక్స్ వేదికగా వార్నింగ్ ఇచ్చారు.ఒక్కసారి అయినా ఇలాంటి కేసు నమోదైతే అది వ్యక్తి భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. 'ఒక కేసు జీవితాన్నే మార్చేస్తుంది. పాస్ పోర్ట్ జారీకి సమస్యలు వస్తాయి, ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశాలు తగ్గిపోతాయి, జీవితాం తం ప్రతికూల ప్రభావాల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. క్షణికావేశంలో చేసే ఒక తప్పు.. భవిష్యత్ మొత్తాన్ని అంధకారంలోకి నెట్టేస్తుంది" అని సజ్జనార్ తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వ అధికారుల భద్రత, గౌరవం, వారి విధులకు రక్షణ కల్పించడం పోలీసుల బాధ్యత అని సీపీ చెప్పారు. ప్రజలు వివాదాలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని, అధికారుల విధులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకం కలిగించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నాయి బ్రాహ్మణుల పోరాటానికి అండగా ఉంటా

**: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



ఎమ్మెల్యేను కలిసిన నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు

**పేట్ బషీరాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని కలిసి విచ్చల విడిగా కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటుతో ఉనికిని కోల్పోతున్న నాయి బ్రాహ్మణ కులవృత్తిని కాపాడాలంటూ అన్య కులస్తులు సెలూన్ల ఏర్పాటుతో సెలూన్ల నిర్వహణ కష్టంగా మారిన పరిస్తితితో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యేకి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ కులవృత్తుల పరిరక్షణలో నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, నాయి బ్రాహ్మణ సోదరులు సమస్యల పరిష్కారంలో ఐకమత్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓం మణికంత నాయి, బ్రాహ్మణ సేవా సంఘం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షులు గడల వెంకటేశ్వర్లు నాయి, చీఫ్ సెక్రటరీ వి.ఎస్. ఆర్.వెంకట్ నాయి, ఛైర్మన్ గడ్డం రవీందర్ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికృష్ణ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి నాయి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్ప : వరప్రసాద్‌గుప్తా

**కుత్బుల్లాపూర్, నవంబరు 20 ప్రభాతవార్త**

మానవ జీవితంలో అన్నిదానాల్లోకెల్లాఅన్నదానం గొప్పదని రంగా నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్ గుప్తా అన్నారు. గురువారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నపూర్ణ సేవాసమితి ఆధ్వర్యంలో రంగానగర్ ప్రధానరహదారిఎపై నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణ సేవాసమితి వంటి స్వచ్ఛంద సేవాసంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ప్రతినెల అమావాస్యను పురస్కరించుకుని పెద్దమనుషుల జ్ఞాపకార్థం నిర్వహించే అన్నదానం ఎంతో శ్రేష్టతను సంతరించుకుందన్నారు. అన్నిదానాలలో అన్నదానం గొప్పదానమన్నారు. అన్నపూర్ణాదేవి' సేవాసమితి అమ్మవారిఆశీస్సులతో ప్రతి అమావాస్య రోజున భక్తులకు అన్నప్రసాదం చేయడం అభినందనీయమన్నారు. భక్తులు ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులై తీర్థప్రసాదాలు, అన్నదానాన్ని స్వీకరించడం అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య ప్రతినిధులు, రంగానగర్ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు

**సికింద్రాబాద్, నవంబర్ 20 ప్రభాతవార్తః**

బౌద్ధనగర్ డివిజన్ న్యూ అశోక్‌నగర్ పార్సిగుట్ట లోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్షకిరణ్ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్రమైన కార్తీక మాసంలో ఎంతో గొప్పగా శివయ్య పూజలు, దీపోత్సవం నిర్వహించడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమని అన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో 1008 దీపాలతో ఈ ప్రాంతం కళకళలాడుతుందని, ఈ కార్యక్రమాన్ని చేపట్టిన మేకల కీర్తి హర్ష కిరణ్‌లను అభినందించారు. మేకల కీర్తి హర్ష కిరణ్ మాట్లాడుతూ ప్రజలందరూ సామూహికంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, నిరంతరం ప్రజా సేవ చేస్తూ వారి కష్టాలు సుఖాలలో తోడుంటానని, పవిత్ర దినోత్సవం లో పాల్గొన్న అందరికి అభినం దనలు తెలిపారు. ఈ కార్యక్రమం లోబిజెపి సికింద్రాబాద్ కంటెస్టె డ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షు రాలు అనిత, ఒములు ముదిరాజ్, శ్యామ్ రాజ్, సుధాకర్, వనమాల శ్రీనివాస్, శోభ రాణి, నాగారాణి, సరిత, భాగ్యమ్మ, లావణ్య, యాదమ్మ, ప్రమీల, జ్యోత్స్న,వాసవి, నిర్మల, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : పద్మారావు గౌడ్



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తహసీల్దార్

**సికింద్రాబాద్, నవంబర్ 20 ప్రభాతవార్తః**

తహసిల్దార్ కార్యాలయం సేవలను నిరంతరం ప్రజలకు అందుబాటులో నిలపాలని, పేదల సమస్యలను వెన్వెంటనే పరిష్కరించాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ సూచించారు. మారేడుపల్లి నూతన తహసిల్దార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ అస్మతుల్లా ఖాన్ గురువారం సితాఫలమండీలోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యుడు పద్మారావు గౌడ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ఏ ప్రలోభాలు, వత్తిళ్ళకు తలొగ్గకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. పేద ప్రజల సమస్యల వెన్వెంటనే పరిష్కరించాలని సూచించారు.

## హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి రూ.1.90కోట్లు మంజూరు



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లికి సన్మానం

**అల్వాల్, నవంబరు 20 ప్రభాతవార్తః** మచ్చబొల్లారం ముక్తధామం స్మశాన వాటిక అభివృద్ధికి 1.90 కోట్లుతో అభివృద్ధి పరచనున్నట్లు కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. గురువారం స్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడంలో కీలక పాత్ర వహించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును స్మశాన వాటిక కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రజలు అవసరాలు మేరకు రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి దోహద పడుతుందని మైనంపల్లి తెలిపారు. మైనంపల్లితో పాటుగా కార్పొరేటర్ జితేందర్‌నాథ్‌ను స్మశాన వాటిక ప్రతినిధులు, స్థానిక కాలనీ వాసులు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముక్తధామం కమిటీ ప్రతినిధులు గుమ్మడి ఆనంద్ రెడ్డి, ఆకుల నర్సింగ్‌రావు, పిడి అశోక్ కుమార్, పుట్నాల క్రిష్ణ, రాంచందర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, దిడ్ల స్వామి, సర్వేశ్ యాదవ్, సూర్యకిరణ్, పద్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలి : వేముల రామకృష్ణ

**హైదరాబాద్ నవంబరు 20 ప్రభాతవార్త ;**

అర్ధాకలి చదువుతో విద్యార్థులు అలమటిస్తున్నారని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు.ప్రభుత్వ ఇంటర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 425 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయని ఇందులో సుమారు 1.70 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. అయితే కాలేజీలో అన్ని నియోజకవర్గంలో మండల కేంద్రాలలో ఉన్నాయి, దీంతో మారుమూల గ్రామాల్లో ఉండే విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తుంది. దీంతో చాలామంది విద్యార్థులు పొద్దున్న ఏమి తినకుండా కాళీ కడుపులతో కళాశాలకు చేరుకుంటున్నారు దీనివల్ల ఉదయం భోజనం తెచ్చుకోవడానికి వీలుపడక కాలికడుపుతోనే విద్యను అభ్యసిస్తున్నారు అని ఆయన పేర్కొన్నారు.మరికొందరు విద్యార్థులు మధ్యాహ్ననికే ఇళ్లకు వెళ్లిపోతున్నారు..ఈ పరిస్థితి కారణంగా ప్రభుత్వ కళాశాలలో డ్రాప్ అవుట్ సంఖ్య పెరుగుతోందన్నారు. విద్యార్థుల హాజరు శాతం 50 శాతం కూడా మించడం



బిసి విద్యార్థి నాయకులతో కలిసి మాట్లాడుతున్న బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

లేదన్నారు. దీంతో విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఫలితాలపై తీవ్ర ప్రభావం ఆకలితో అలమటిస్తూ పాఠ్య అంశాలపై దృష్టి పెట్టలేకపోతున్నారు కొందరు. విద్యార్థులు నిరసంతో ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఫలితంగా హాజరు శాతం తోపాటు విద్యార్జనతో పాటు ఫలితాలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి నాయకులు ఆనంద్, పవన్ ,యశ్వంత్, పవర్ ,అజయ్ ,గణేష్ ,అర్జున్ పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి

**సైఫాబాద్, నవంబరు 20 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులు, కళాకారుల కంటే అతిపెద్ద పాత్ర పోషించింది విద్యార్థి ఉద్యమ నాయకులని అనాటి తెలంగాణ విద్యార్థి జెఏసి ఛైర్మన్, ఎస్సీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి చెప్పారు. విద్యార్థులు లేకపోతే ఆనాడు తెలంగాణ రాష్ట్ర ఉద్యమం లేదని, తెలంగాణ ఉండేది కాదని ఆయన స్పష్టం చేశారు. గురువారం బషీంబాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థి నాయకుల వీరోచిత పోరాటం వల్లనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వాలు సముచితం స్థానం కల్పించలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా 250 గజాల స్థలాన్ని పంపిణి చేయాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇంకా ఉన్న కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలు కేటాయింపు వల్ల ప్రభుత్వానికి ఏలాంటి ఆర్థిక భారం పడదన్నారు. పై డిమాండ్ల సాధన కోసం, తెలంగాణ ఇచ్చిన ఎఐసిసి నేత సోనియాగాంధీకి



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

కృతజ్ఞతలు తెలుపుతూ డిసెంబరు 9వ తేదీన దీక్ష చేపడుతున్నామన్నారు. కాకతీయ యూనివర్సిటి జెఎసి ఛైర్మన్ రాజేష్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ నాయకులకు ప్రభుత్వం అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. లేని పక్షంలో బిఆర్ఎస్‌కు వచ్చిన పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకులు రాములు, యాకూబ్‌రెడ్డి, దామోదర్, ఫరూఖ్, బోరెల్లి సురేష్, జెకె, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక సంగీతానికి దర్పణం ఎంఎస్.సుబ్బలక్ష్మి

**నాంపల్లి, నవంబరు 20 ప్రభాతవార్త :** భారతీయ శాస్త్రీయ సంగీతం, ఆధ్యాత్మిక కీర్తనలు, గేయాలకు దర్పణం ఎం.ఎస్.సుబ్బలక్ష్మి అని వక్తలు ప్రశంసించారు. సంగీత సామ్రాజ్ఞి ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, నటప్రపూర్ణ తెలంగాణ తొలి సినీ కథానాయకుడు కాంతారావు జయంతులను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతి కశాఖ, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థల సౌజన్యంతో హైహోమ్ అవతార్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కల్చరల్‌వింగ్ ఆధ్వర్యంలో మధురం సాంస్కృతిక సంస్థ సమర్పణలో ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, కాంతారావుల జీవిత చరిత్రలను ప్రతిబింబించేలా శ్రీసాయి సంతోషి నాట్యమండలి (సురభి) సంస్థ కళాకారులచే ప్రదర్శింపబడిన నాటకాలు ప్రతీఒక్కరి ప్రశంసలు అందుకున్నాయి. ఈ నాటకాల్లో ఎంఎస్.సుబ్బలక్ష్మి పుట్టుక నుండి మరణం వరకు ముఖ్యమైన ఘట్టాలు, ఆమె సుమధుర ఆధ్యాత్మిక, సంప్రదాయ గీతాలు సందర్భోచితంగా పొందుపరచడం ప్రత్యేకతను సంతరించుకుంది. అలాగే సినీనటుడు కాంతారావు సినిమాల్లో ముఖ్యమైన ఘట్టాలను, నటనాచాతుర్య అంశాలకు అద్భుత వ్యాఖ్యానాన్ని జతపరిచి ప్రముఖ రచయిత, దర్శకుడు భాస్కర



వేదవతి ప్రభాకర్‌కు ఎంఎస్.సుబ్బలక్ష్మి స్మారక అవార్డును ప్రదానం చేస్తున్న బుజ్జి, మహ్మద్‌రఫీ, సత్యజగదీష్ తదితర అతిథులు

ని సత్యజగదీష్ సురభి కళాకారుల అద్భుత నటనలతో రక్తికట్టించి గొప్ప దృశ్యకావ్యాలుగా మలిచారు. ఈ సందర్భంగా కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు-బుజ్జి ఆధ్వర్యంలో సత్యజగదీష్, సంతోష్‌కుమార్, డా. మహ్మద్‌రఫీ, పలువురు ప్రముఖులతో కలిసి ప్రముఖ గాయని వేదవతిప్రభాకర్, అన్నమయ్య పదకోకిల పద్మశ్రీ శోభారాజు, కర్ణాటక సంగీత విద్వాంసురాలు గార్లపాటి పల్లవి, సినీసంగీత దర్శకుడు గౌర హరిలను ఘనంగా సత్కరించి ఎం.ఎస్.సుబ్బలక్ష్మి స్మారక అవార్డులను ప్రదానం చేశారు.

## త్వరలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్టాప్ అసోసియేషన్‌తో మంత్రి ప్రత్యేక సమావేశం

**హైదరాబాద్, నవంబర్ 20,ప్రభాతవార్త :** షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి లక్ష్మణ్‌తో టీజీ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కార్యవర్గం జరిపిన సమావేశం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. స్టాఫ్ అసోసియేషన్ ప్రస్తావించిన పలు డిమాండ్లకు మంత్రి అడ్లూరి సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఎస్సిడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రిప్రజెంటేషన్‌పై చర్చించేందుకు సెక్రటరీతో సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కార్యవర్గంతో సెక్రెటేరియట్‌లోని తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటిని తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. డిఎస్‌సిడిఓ, సూపరింటెండెంట్ కేడర్ స్ట్రెంతును తక్షణమే మంజూరు చేయాలని, సూపరింటెండెంట్‌లను అడ్మినిస్ట్రేషన్ అధికారిగా గెజిటెడ్ హోదా కల్పించాలని, ఐఎఫ్ఎంఐఎస్‌లో జాక్ట్‌ను తొలగిస్తేనే జాక్ట్‌లను జూనియర్ అసిస్టెంట్‌లుగా మార్చడానికి వీలవుతుందని ఎస్సీ డిడి మినిస్టీరియల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ మంత్రికి వివరించారు. అదేవిధంగా ఇటీవల ప్రభుత్వం 317 జీవో ప్రభుత్వ ఉద్యోగ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని



కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. అర్హత ఉన్న జాక్ట్‌లను అందరిని జూనియర్ అసిస్టెంట్‌లుగా మార్చే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కార్యవర్గం కోరింది. కొన్ని జిల్లాలలో కేడర్ స్ట్రెంత్ చాలా తక్కువగా ఉండి పని భారం పెరిగి ఉద్యోగస్తులు మానసిక వేదనకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. ఎస్సీ కార్పొరేషన్‌లో అన్ని రకాల కేడర్‌లలో 50శాతం కోటా కింద ఎస్సిడిది సిబ్బందికి అవకాశం కల్పించాలని, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇనిస్ట్యూట్‌లో 25శాతం కోటాకు అవకాశం కల్పించాలని, ఇతర క్లిష్ట సమస్యలన్నింటిని తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఎస్సిడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి యుఎ.అరవింద్ కుమార్, ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ కె.లత, మహిళా నాయకురాలు కొప్పోలు అనురూప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి గణపురం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు విజ్ఞప్తి చేశారు.

## బోరబండ కార్పొరేటర్‌కు బెదిరింపు లేఖ

**జూబ్లీహిల్స్, నవంబరు 20, ప్రభాతవార్తః** బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపు లేఖ రాశారు. ఒక కవర్‌లో పెట్టిన బెదిరింపు లేఖను ఆయన ఇంటి గేట్ లోపల వేసి పారిపోయారు. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 18న రాత్రి 10.30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లిన లేఖలో బీఆర్ఎస్ నేతలైన విజయ్‌సింహా, ఖదీర్ భాయి, స్కూల్ ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ పేర్లతో 'మీ వలీమా(పెళ్లి తరువాత జరిగే తంతు) చేయడానికి సిద్ధమయ్యాము' అంటూ బెదిరింపు ధోరణితో రాశారు. సీసీ టీవీ ఫుటేజీలో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి వద్దకు వచ్చి కవర్ విసిరేసి వెళ్లిన దృశ్యాలు ఉన్నాయి. ఈ ఘటనపై కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**అత్తాపూర్ నవంబరు20,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రీపురం కింగ్స్ కాలనీ బంరకునాథ్ దద్ల చెరువుకు సంబంధించిన ఎఫ్‌టిఎస్ ,బఫర్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడడంతో పలువురు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు గురువారం రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఆక్రమణదారులకు,హైడ్రా అధికారుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.పోలిసులు రంగప్రవేశం చేసుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కూల్చివేతలు సాగించారు.చెరువులు,నాలాలను ఆక్రమించిన నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నగర పోలీసు కమిషనర్‌ను కలిసిన నవీన్‌యాదవ్

**జూబ్లీహిల్స్, నవంబరు 20, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో గెలుపొందిన నవీన్‌యాదవ్ గురువారం నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి ఆయన పుష్పగుచ్చాలను అందించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో భద్రతాచర్యల బలోపేతం, యువతకు నేర నివారణ, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై దృష్టి పెట్టాలని కోరారు. అంతకముందు నవీన్‌యాదవ్ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : కవిత

**అత్తాపూర్ నవంబరు 20, ప్రభాతవార్త :**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ జాగృతి అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లో జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా పర్యటించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కవితను రాజేంద్రనగర్ జర్నలిస్టులు పలువురు కలిసి జర్నలిస్టుల సమస్యలను వివరించారు.అక్రిడిటేషన్ కార్డు,హెల్త్ కార్డులు,ప్లాట్ల పంపిణీ విషయాలను వివరించారు.ఈ విషయమై సానుకూలంగా స్పదించిన ఆమె జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాన్నానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సుర్యకిరణ్, బాలు,దస్తగిరి, బాల మురళికృష్ణ,శ్రీకాంత్,గణేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక భగీరథ మోక్షగుండం విశ్వేశ్వరయ్య : సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి నవంబర్ 20 ప్రభాతవార్త :** భగీరథుడు ఆకాశ గంగ ను భూ మార్గానికి తెచ్చారని పురాణ కథనం కాగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య కర్ణాటక తెలంగాణ ప్రాంతాలలో ప్రాజెక్ట్ ల రూప కల్పన తో నీటి వనరులు ప్రజలకు అందించి ఆధునిక భగీరథ గా పేరు తెచ్చుకున్నారని తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణ లో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య యాది లో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా వి. ఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ నైజాం నవాబు విశ్వేశ్వరయ్య సలహా సూచన ల మేరకు మూసీ నది పై వరదలకు అడ్డుకట్ట గా ప్రాజెక్టు నిర్మించారని గుర్తు చేశారు. అధ్యక్షత



ప్రసంగిస్తున్న తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య రూప కల్పన చేసిన ప్రాజెక్ట్ లు నేటికీ వినియోగం లో వున్నాయని అయన భారీ ప్రాజెక్టు ల నిర్మాణం లో దార్శనికుడు అని చెప్పారు. వేదిక పై కవయిత్రి శైలజ మిత్ర, గానసభ పాలక మండలి సభ్యుడు బండి శ్రీనివాస్, గాయని గరిమెళ్ళ సీత తదితరులు పాల్గొన్నారు.

## డబ్బు శాశ్వతం కాదు.. మనం అందించిన సేవనే శాశ్వతం : ఎంపి ఈటల

**చిక్కడపల్లి నవంబర్ 20 ప్రభాతవార్త :** డబ్బు శాశ్వతం కాదు.. మనం అందించిన సేవనే శాశ్వతంగా నిలుస్తుందని మల్కాజిగిరి లోకసభ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై జాతీయ సంగీత కళా కారుల సంఘం నిర్వాహణలో ధన్వంతరి జయంతి వేడుకలు సంఘం అధ్యక్షుడు ఎల్వి.చెన్నారావు నిర్వహణలో జరిగాయి. ఈ సందర్భంగా గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ వాణి దేవి, ఈ యెన్ టి హాస్పిటల్ సూపరింటెండెంట్ ఆనంద్ ఆచార్య ఇతర వైద్యులు నాగ వర్ధన్ బాబు, హరి ప్రియ, ప్రేమానంద రావు, రమేష్ బాబు,సంగీత కళా కారుడు డి వి మోహన్ కృష్ణ లను సత్కరించిన అనంతరం ఈటెల రాజేందర్ మాట్లాడారు కరోనా కష్ట కాలంలో ప్రపంచమంతా ప్రాణాలు గుప్పిట్లో పట్టుకొని బ్రతుకుతుంటే.. సేవలు అందించిన వారు వైద్యులు మాత్రమేనని, కరోనా కష్ట కాలం లో వైద్యులు చేసిన సేవ వైద్యులు దైవ సమానులు భావన కలిగించారని చెప్పారు. వైద్యం పూర్తి గా వ్యాపారం కాలేదని, తక్కువ వేతనం తో పని చేస్తున్న వైద్యులు కూడా ఉన్నారని అన్నారు. వైద్యులు దైవ సమానులు అని ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత



వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరిస్తున్న లోకసభ సభ్యుడు ఈటెల రాజేందర్, చిత్రంలో డాక్టర్ కె.వి. రమణ చర్య, ఎల్ వి.చిన్న రావు తదితరులున్నారు.

ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. ఏన్నో కార్పొరేట్ హాస్పిటల్స్ వెలుస్తున్నాయి కానీ అన్నీ సేవా భావం తో పని చేయడంలేదని అన్నారు వైద్య వృత్తి వ్యాపారం గా కాక సేవా ప్రవృత్తి గా భావించాలన్నారు. సంస్కర భారతి అధ్యక్షుడు కె కె శర్మ, నిర్వాహక సంస్థ గౌరవ అధ్యక్షుడు జిల్లెలా రవి యాదవ్, సంఘం ఏపి విభాగం అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మారం రెడ్డి, కార్యదర్శి పి.నగేష్, కార్యవర్గ సభ్యుడు మనోజ్ శంకరమంచి , ఆర్ సి.చెన్నకేశవులు, కర్ణాటక విభాగం ఉపాధ్యక్షుడు ఎం.హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సచిన్ సావంత్‌ను కలిసిన చార్మినార్,బహదూర్‌పుర నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీలు ముజీబుల్లా షరీఫ్,పులిపాటి రాజేష్ కుమార్

**చార్మినార్,నవంబరు 20 ప్రభాతవార్త :**

ఏఐసీసీ కార్యదర్శి తెలంగాణ రాష్ట్రానికి నూతనంగా ఇంఛార్జిగా నియమితులైన సచిన్ సావంత్‌ను గాంధీభవన్‌లో చార్మినార్,బహదూర్‌పుర నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీలు ముజీబుల్లా షరీఫ్,పులిపాటి రాజేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పని తీరు గురించి సచిన్ సావంత్ అడిగారని వారు తెలిపారు.

## రోడ్ల పక్కన చెత్త వేస్తే జరిమానాలు వేస్తాం : లచ్చిరాం



రోడ్ల పక్కన భవనాల వేస్ట్ మెటీరియల్ వేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌కు రూ.15.వేల జరిమాన విధిస్తున్న శానిటరి ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం.

**నార్సింగి, నవంబర్ 20 ప్రభాతవార్త :** రోడ్ల పక్కన భవనాల వేస్ట్ మెటీరియల్ వేస్తే భారీ జరిమానాలు వేస్తామని నార్సింగి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం పేర్కొన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని రోడ్డు పక్కన వేస్ట్ మెటీరియల్ వేస్తున్న ఓ ట్రాక్టర్ శ్రీనివాస్‌ను శానిటరీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డ్రైవర్‌ను మున్సిపాలిటీకి తీసుకెళ్లి పారిశుద్యంపై అవగాహన కల్పించారు. అనంతరం అతడికి రూ.15.వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ నార్సింగి మున్సిపాలిటీని పరిశుభ్రతలో రంగారెడ్డి జిల్లాలోనే నెంబర్ వన్‌గా నిలిపేందుకు కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజలందరూ తమ ఇళ్లల్లో వెలువడ్డ చెత్తను ఆటోల్లోనే వేయాలని, రోడ్ల పక్కల వేయవద్దని సూచించారు. మనముంటున్న ప్రాంతంలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉంటామని తెలిపారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొనే పారిశుద్యంపై కమీషనర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని లచ్చిరాం వివరించారు. కమీషనర్ ఆదేశాల మేరకు రోడ్ల పక్కన చెత్త వేసే వారిపై జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు.

## పాడైన రోడ్లకు మరమ్మతులు చేయండి

**- బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ**



మణికొండలోని ఖిజ్రా కాలనీలో పాడైపోయిన రోడ్డును పరిశీలిస్తున్న బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ

**నార్సింగి, నవంబర్ 20 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఖిజ్రా కాలనీలో పాడైపోయిన రోడ్లకు వెంటనే మరమ్మత్తులు చేయాలని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పాడైపోయిన రోడ్లను బిఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ మున్సిపాలిటీలకు ప్రజలు క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నారని, అధికారులు మాత్రం ప్రజలకు కనీస అవసరాలను తీర్చడంలో అలసత్వం వహించడం దారుణమన్నారు. అధికారుల పర్యవేక్షణ కరువవడం వలన నాశీరకపు రోడ్లు వేస్తున్నారని, ఎక్కడ పడితే అక్కడ రోడ్లను తవ్వేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. తవ్విన వ్యర్థాలు రోడ్లపైనే వదిలేయడంతో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారన్నారు. ఈ విషయంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే అధికార గణం స్పందించి గోతులు పడ్డ రోడ్లన్నింటికి మరమ్మత్తులు చేయాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి, అండె లక్ష్మణ్‌రావ్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న ట్రాన్స్‌జెండర్ మృతి

**జూబ్లీహిల్స్, నవంబరు 20, ప్రభాతవార్తః**

బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు రోజుల క్రితం పెట్రోల్ పోసుకొని నిర్వహించిన ఆందోళనలో మంటలు అంటుకొని గాయాలపాలైన వారిలో ఒక ట్రాన్స్‌జెండర్ గురువారం ఉదయం ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 18న బోరబండ బస్టాప్ వద్ద ట్రాన్స్‌జెండర్ మోనాలిసాపై చర్యలు తీసుకోవాలంటూ ట్రాన్స్‌జెండర్ స్వప్న గ్రూపు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. దాదాపు 50 మందికి పైగా ఇక్కడికి చేరుకొని ఒంటిపై పెట్రోల్ పోసుకొని చేతిలో లైటర్లు పట్టుకొని ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న బోరబండ పోలీసులు సైతం అక్కడికి చేరుకోవడం, అదే సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఏడుగురు ట్రాన్స్‌జెండర్లతోపాటు బోరబండ ఇన్‌స్పెక్టర్ సురేందర్, మరో మహిళా కానిస్టేబుల్ గాయపడిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అప్సర గురువారం ఉదయం ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

**మోనాలిసా అరెస్ట్.**

మోనాలిసా వేధింపులు భరించలేక ఈ నెల 17న స్వప్న బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు ట్రాన్స్‌జెండర్ మోనాలిసాను అరెస్ట్ చేసినట్లు బోరబండ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు.

## 150 కిలోల స్టీల్ రింగులు మాయం

**జూబ్లీహిల్స్, నవంబరు 14, ప్రభాతవార్తః**

పనిచేసే ప్రాంతం నుంచి దాదాపు 150 కిలోల స్టీల్ రింగులు మాయమైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లోని ప్లాట్ నంబరు 84లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల వద్ద పెట్టిన దాదాపు 150 కిలోల 200ల స్టీల్ రింగులు మాయమయ్యాయి. ఈ సంఘటనపై సైట్ ఇంజనీర్ చిలుక సతీష్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బంగారు వజ్రాభరణాలు తీసుకొని మోసం

**జూబ్లీహిల్స్, నవంబరు 14, ప్రభాతవార్తః**

ఆభరణాలను తీసుకొని మోసగించిన సంఘటనలో ఇద్దరిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రోడ్ నంబు 10లోని జెవర్ జువెల్స్‌లో మైదం షణ్ముక కార్తిక్ వద్ద నుంచి భాష్యకార జువెలరీ, ఉమ మహేష్ కాసారంలు 2023లో నాలుగు బంగారు వజ్రాభరణాలు తీసుకొన్నారు. దాదాపు రూ. 15,56,710 బిల్లుకు గాను రూ.3 లక్షలను ముందస్తుగా చెల్లించారు. మొత్తం 23, 41,311లకుగాను వారు ఇచ్చిన చెక్కులు బౌన్సులు అయ్యాయి.డబ్బులు తిరిగి చెల్లించకుండా కాలయాపన చేస్తుండటంతో మోసపూరితంగా ఈ చర్యలకు పాల్పడుతున్నట్లు షణ్ము కకార్తిక్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు జూబ్లీ హిల్స్ పోలీసులు కాసారంలోని భాష్యకార జువెలర్స్‌తో పాటు ఉమా మహేష్ కాసారంలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మనస్థాపంతో వివాహిత ఆత్మహత్య

**పేట్ బషీరాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త**

పెట్ బషీరాబాద్‌లో నివాసం ఉండే ప్రణయ (29) ఉరి వేసుకుని ఆత్మహతకు పాల్పడిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆమెకు వివాహం అయ్యి తన భర్తతో గొడవల కారణంగా ఆమె తల్లిదండ్రుల ఇంట్లోనే ఉంటుంది. ఆమె తన భర్త మీద కేసు నమోదు చేయగా, ప్రస్తుతం అది మేడ్చల్ కోర్టులో ట్రైల్‌లో ఉంది. ఈ నెల 19వ తేదీన సుమారు 20.30 గంటలకు ఇంట్లో జరిగిన గొడవ కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై తన గదిలోకి వెళ్లి తలుపు గడియ వేసుకుని, సీయిలింగ్ ఫ్యాన్‌కు తన చీరతో ఉరి వేసుకుని ఆత్మహతకు పాల్పడింది. మృహురాలికి సంతానం లేరు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డిసిఎం ఢీకొని వ్యక్తి మృతి

**జీడిమెట్ల, నవంబర్ 20, ప్రభాతవార్త**

సూరారం సాయిబాబా నగర్ చౌరస్తాలో డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. చింతల్, మధుసూధన్ రెడ్డి నగర్‌కు చెందిన శ్రీనివాస్ రెడ్డి (55)గా గుర్తింపు ఇతను ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. డీసీఎం తలపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అత్తాపూర్ నవంబరు20,ప్రభాతవార్త :**

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పిఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం..బుద్వేల్ వాటర్ ట్యాంక్ వద్ద ఈ నెల 15న 55సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి స్పృహ కోల్పోయి.పడి ఉండడాన్ని చూసిన స్థానికులు పోలీసులు సమాచారం అందించారు.ఘటన స్థలా నికి చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ 16న మృతి చెందా డు.మరిణించిన వ్యక్తి తాలూక ఎవ్వరైన ఉంటే పోలీసులు సంప్రదించాలని సూచించారు.

## పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ పనులు పూర్తి చేయాలి



మేయర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కవాడిగూడ బీజేపీ నేతలు

**ముషీరాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త:** కవాడిగూడలో పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ పనులకు నిధులు మంజూరు చేసి, పనులు వేగవంతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కవాడిగూడ బీజేపీ నేతలు జి.వెంకటేష్, ఎం.సి.మహేందర్‌బాబు, డివిజన్ అధ్యక్షులు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి బొల్ల రమేష్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షులు ఏ.ప్రభాకర్‌గంగపుత్ర, శివరాజ్‌లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వారు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి, వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లోని అడ్వకేట్స్ కాలనీ, కొత్త బజార్, పూల్‌బాగ్, గంగపుత్ర గల్లి తదితర బస్తీలలో సీసీ రోడ్ల ఏర్పాటుకు గతంలో ఇచ్చిన ప్రతిపాదనల ప్రకారం నిధులు మంజూరు చేసి, రోడ్ల నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా కవాడిగూడ డివిజన్ దోమలగూడ మున్సిపల్ మార్కెట్ వద్ద నిర్మించిన సర్కిల్ కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మేయర్ తప్పకుండా పెండిగ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

## మెరుగైన వైద్యానికి సిఎంఆర్ఎఫ్ సద్వినియోగం చేసుకోవాలి



సిఎం.ఆర్.ఎఫ్.చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**అడ్డగుట్ట,నవంబర్ 20 ప్రభాతవార్త:** ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మెరుగైన వైద్యం కోసం సిఎం.ఆర్.ఎఫ్. నిధి ద్వారా మంజూరైన 15 మందికి చెక్కులను గురువారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేస్తే ప్రజలు రోగాల బారిన పడుతారని, అందువల్ల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మెరుగైన వైద్యం కోసం ముఖ్య మంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కుర్మ హేమలత, మాజీ కార్పోరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరిక్రిష్ణ, నాగులు, వెంకటేషన్ రాజు, శ్రీహరి, కొండాపురం మహేష్ యాదవ్,లక్ష్మిపతి, శేఖర్,ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలి : జంపన



బోయిన్‌పల్లిలో అన్నదానం చేస్తున్న జంపనప్రతాప్

**కంటోన్మెంట్,నవంబర్ 20 ప్రభాతవార్త:** పేదలకు అన్నదానం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని గురువారం 1వ వార్డు బాపూజీ నగర్, శ్రీదేవి నల్లపోచమ్మ దేవాలయం, చిన్నతోకట్ట కట్ట మైసమ్మ ఆలయాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నాయకులు అనుజిత, ఆలయ కమిటీ సభ్యులు అజిత్ కళ్యాణ్, పి.నర్సింహ్మ,ప్రేమ్ ముదిరాజ్, రామారావ్, కరన్ సింగ్, సాయిబాబా యాదవ్,మారుతీ గౌడ్, అరుణ్ యాదవ్, జాజుల క్రాంతి, సాయి పాల్గొన్నారు.

## పేదవాడి కడుపు నింపడం గొప్ప వరం



అన్నదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్
మమత సంతోష్‌గుప్త దంపతులు

**గన్‌ఫౌండ్రి,నవంబర్ 20ప్రభాతవార్త:** అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మహాదానం అని ఆకలితో అలమటిస్తున్న ప్రతి పేదవాని కడుపు నింపడం గొప్ప వరమని మాజీ కార్పొరేటర్ పి.మమత సంతోష్‌గుప్త దంపతులు అన్నారు.బంగారు మైసమ్మ దేవాలయం సమీపంలో హైదరాబాద్ జిల్లాఆర్యవైశ్య మహాసభ ఆద్వర్యంలో అన్నదానం చేశారు. ఈకార్యక్ర మంలో ఐఐఎంసి కళాశాల ప్రిన్సిపల్‌కూర రఘువీర్‌గుప్త, లక్ష్మన్‌గుప్త,కటకం శివకుమార్‌గుప్త,కోశాధికారి లింగం ప్రకాష్‌గుప్త, సత్యంగుప్త, పాండురంగగుప్త తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు



**మూసాపేట్, నవంబర్ 20, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి సర్కిల్ 24 పరిధిలోని అనేక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కూకట్‌పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఈ మధ్య కాలంలో అనేక అక్రమ కట్టడాలు జరుగుతున్నప్పటికి ఓ వైపు భారీ అక్రమ కట్టడాలకు సీజులు తొలగించుకోమని చెప్పి పనులు చేసుకోమని భారీ స్థాయిలో ముడుపులు అందుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి సాక్షంగానే హైదర్‌నగర్ డివిజన్‌లో ఓ భారీ కట్టడం గత మూడు నెలల క్రింద సీజ్ చేశామని చెప్పినప్పటికి అధికారుల చేసిన సీజ్‌ను బేఖాతార్ చేస్తూ యాధేచ్ఛగా పనులు కొనసాగిస్తున్నారు. అంతేగాక సీజ్ అయిన బిల్డింగ్‌కు కమర్షియల్ స్పేస్ ఇవ్వబడును అని టు లెట్ బోర్డ్ పెట్టడం పక్కా ఆధారాలతో అధికారుల నిజాయితీ తెలియజేస్తుంది. సర్కిల్లో కడుతున్న ప్రతి కట్టడానికి ఖచ్చితంగా నోటీసులు ఇస్తూనే అందినకాడికి దండుకుంటున్నారు. ఇచ్చిన నోటీసులు అన్నీ ఎటుపోతున్నాయో మాత్రం వాటి అంతరార్దం ఏ అధికారి దగ్గర సరైన సమాధానం కరువైయింది. మనం ఎవరికి సమాధానం చెప్పే అవసరం లేదని ప్రతి కట్టడం దగ్గర క్రింది స్థాయి సిబ్బంది మొదలకొని ఉన్నతాధికారుల వరకు యాధేచ్ఛగా ముడుపులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సాక్షంగా తులసినగర్ కాలనీలో ఓ కట్టడం దగ్గర భారీ స్థాయిలో ముడుపులు అందుకుని ధైర్యంగా కట్టుకోమని భరోసా ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ ముడుపుల విషయం జోనల్ కమిషనర్‌కు తెలవకుండా కాపాడుతున్నట్లు తెలియవచ్చింది. ఈ కట్టడాల విషయంలో భారీస్థాయిలో ముడుపులు అప్పజెప్పిన బిల్డర్లు అక్రమ కట్టడాల గురించి ప్రశ్నించిన, ఫిర్యాదు చేసిన ప్రజలను దిక్కు ఉన్నకాడ చెప్పుకోమని బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వినిస్తున్నాయి. ఈ బిల్డింగ్ ఏమాత్రం సెట్‌బాక్‌లు లేకుండా అక్రమంగా స్టిల్ట్ ప్లస్ 2 పర్మిషన్ కలిగి 6 ఫ్లోర్లు కలిగిన కట్టడలే ఇక్కడ నిర్మించడం విశేషం. అక్రమ కట్టడం నిర్మిస్తున్న ఏరియాకు అధికారులు వచ్చి హడావుడి చేసి నోటిస్‌లు మాత్రం ఖచ్చితంగా ఇస్తారని సీజ్ మాత్రం ముడుపులు అందని వాటికి మాత్రమే వర్తిస్తుందని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. సీజ్ చేసిన అక్రమ నిర్మాణాలను కొన్ని రోజుల తరువాత తిరిగి నిర్మిస్తున్నారని టిపిఎస్‌ను వివరణ కోరగా.. నిబంధనలకు విరుధంగా భవనాలు నిర్మిస్తే నోటీసులు ఇవ్వడంతో పాటు వాటిని కూల్చివేస్తామని తెలిపారు.

## 4 వేల కోట్లు ఎక్కడ ఖర్చుపెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలి

### : డాక్టర్ వంషా తిలక్

**కంటోన్మెంట్,నవంబర్ 20 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి 4వేల కోట్లు ఖర్చు పెట్టినట్లు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో ప్రకటించడం సరైంది కాదని, ఒకవేళ ఖర్చుపెట్టినట్లైతే శ్వేత పత్రం విడుదల చేయాలని కంటోన్మెంట్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ వంషా తిలక్ తెలిపారు. గురువారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసినవిలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వ రక్షణ శాఖ స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసినందుకు రూ.303 కోట్లు వచ్చాయన్నారు ఆ డబ్బులు రక్షణ శాఖ ఖాతాలోకి జమ కావాల్సి ఉండగా కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాలు అన్నిన రంగాల్లో వెనుక బడి ఉందని, ఆడబ్బులు రక్షణ శాఖ ఖాతాలోకి కాకుండా కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి ఖర్చు పెట్టే విధంగా చేయాలని ఎంపీ ఈటెల రాజేందర్,కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల విజ్ఞప్తి మేరకు కంటోన్మెంట్ బోర్డు నిధికి వచ్చాయన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క కంటోన్మెంట్‌కు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. 9 నెలల్లో బోర్డు మెంబర్ బానుక నర్మధ 12 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. నియోజకవర్గంలో 2బిహెచ్‌కె నిర్మాణం పనులు గత ప్రభుత్వంలోనే చేపట్టిందన్నారు.

## మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కాలేజ్‌కి శరీర దానం

**నిజాంపేట్, నవంబర్ 20, ప్రభాతవార్త**

మదీన గూడ మై హోమ్ జ్యూవెల్ క్లబ్ హౌస్ నివాసి కొండకింది కమలమ్మ (86) బుధవారం మధ్యాహ్నం 1 గంటలకు మరణించారు. ఆమె కోరిక మేరకు ఆమె పార్థివ దేహన్ని విద్యార్థులు పరిశోధనల నిమిత్తం మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కి ఆమె కుమారుడు కొండకింది రామ కృష్ణారెడ్డి, కుమార్తెలు అలుగుపల్లి శాంత, బత్తుల సుగుణలు గురువారం అనాటమీ డిపార్ట్మెంట్‌కు అప్పగించడం జరిగింది. వారి ఔనత్యాని మేనేజింగ్ డైరెక్టర్ డా. పువ్వాడ నయన్ రాజ్, అనాటమీ హెడ్, వైస్ ప్రిన్సిపాల్ డా. నవీన్ కుమార్ కొనియాడారు.

## ప్రజలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**నిజాంపేట్, నవంబర్ 20, ప్రభాతవార్త**

అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ఆపన్న హస్తంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిధులు మంజూరు చేయించి ఎమ్మెల్యే వివేకానంద ప్రజా మన్ననలు చూరగొంటున్నారు. నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌కు చెందిన యార్లగడ్డ సుబ్బయమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వారికీ ఎమ్మెల్యే కె. పి.వివేకానంద చికిత్స కోసం రూ. 1,10,000 ఎల్.ఓ.సి.ని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేయించారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, పెద్దిరెడ్డి సుజాతలు కలిసి బాధితు కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసి చెక్‌ను అందజేశారు.

### ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి : బానుక నర్మధ



సిఈఓ అరవింద్ ద్వివేదితో బేటీ అయిన బోర్డు మెంబర్ నర్మధ

**కంటోన్మెంట్,నవంబర్ 20 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ,మంచినీరు వంటి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేదికి విజ్ఞప్తి చేశారు. గురువారం బోర్డు మెంబర్ నర్మధతో పాటు బిజెపి నాయకులు సిఈఓను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ వంషా తిలక్, బిజెపి సీనియర్ నాయకులు బి.ఎన్.శ్రీనివాస్, పరశరామ్, బానుక మల్లికార్జున్, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి గృహిణి దుర్మణం**

**ఉప్పల్, నవంబరు 20 ప్రభాతవార్త :** రామంతాపూర్ కెసిఆర్‌నగర్‌లో విషాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఒక గృహిణి దుర్మణం చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు మండలం, కడుమ గ్రామానికి చెందిన కిల్లారి శ్రీరాములు, కిల్లారి భారతి దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి రామంతాపూర్ కెసిఆర్‌నగర్‌లో అద్దెకు ఉంటున్నారు. అయితే గురువారం ఉదయం కిల్లారి భారతి (52) నల్లా నీరు పట్టుకునేందుకు నీటి సంపు తెరిచి నల్లా వాల్ బంద్ చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిన ట్లు తెలిపారు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానికులు గమనించి భర్తకు సమాచారం అందించారు. వెంటనే ఆమెను బయటికి తీసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందిన ట్లు తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె ఉన్నారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రేషన్ కార్డుదారులు అందరూ కెవైసి చేయించుకోవాలి -సర్కిల్ 8 ఏఎస్ఓ కృష్ణవేణి.

**బేగంపేట నవంబరు 20,ప్రభాతవార్త**

రేషన్ కార్డులు కలిగి ఉన్న వారంతా కేవైసీ ని చేయించుకోవాలని సర్కిల్ 8 ఏఎస్ఓ కృష్ణవేణి కోరారు.పాత కార్డులు కలిగి ఉన్న వారిలో ఇంకా చాలామంది కేవైసీని పూర్తి చేయించుకోలేదన్నారు.కొత్తగా కార్డులు వచ్చిన వారు కుటుంబంతో సహా సమీపంలోని రేషన్ దుకాణాలకు వెళ్లి కేవైసీ చేయించుకోవాలని సూచించారు.సర్కిల్ 8 పరిధిలో కొత్తగా సుమారు 8వేల కార్డులు మంజూరు చేసినట్లు ఏఎస్ఓ వెల్లడించారు,వీటితో పాటు సర్కిల్ పరిధిలో మొత్తం 77,271 కార్డులు ఉండగా 2,78,942మంది లబ్దిదారులు ఉన్నారని,అందులో 1,87,551 లబ్దిదారులు కేవైసీ చేయించుకోగా మిగిలిన వారు చేయించుకోలేదని,వివరించారు.రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరికీ ఇది వర్తిస్తుందన్నారు.సర్కిల్ పరిధిలోని 67 రేషన్ దుకాణాల్లో లేదా ఇతర ఏ రేషన్ దుకాణంలోనైనా కేవైసీని చేయించుకోవచ్చని ఏఎస్ఓ కృష్ణవేణి తెలియజేసారు.

## కన్నులపండువగా శ్రీసంగమేశ్వరస్వామి కార్తీకమాస మహోత్సవాలు



శ్రీసంగమేశ్వరస్వామి సప్తవింశతి కలశాభిషేకంలో తరిస్తున్న వందలాది భక్తజన సందోహం

**నాంపల్లి, నవంబరు 20 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శ్రీ సంగమేశ్వర, శ్రీ వేంకటేశ్వరస్వామివార్ల దేవాలయంలో పవిత్ర కార్తీమమాస మహోత్సవాలు ఈరోజు వందలాదిమంది భక్తుల శివనామస్మరణతో కన్నులపండువగా ముగిసాయి. నెలరోజులపాటు జరిగిన ఈ కార్తీకమాస మహోత్సవాల్లో మాసశివరాత్రిని పురస్కరించుకొని తెల్లవారురుఘామున 4గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, ఉదయం 7.30, 9, 10.30లకు ఏకవార రుద్రాభిషేకములు, రాత్రి 6.30గంటల నుండి శివకళ్యాణ మహోత్సవం; గురువారం ఉదయం 9గంటలకు సప్తవింశతి కలశాభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కనీవిని ఎరుగనిరీతిలో అద్భుతంగా అర్చకస్వాములు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వందలాదిమంది భక్తులు ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీ సంగమేశ్వరస్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

### వీరభద్రస్వామి సహిత మహాకాళ్వేర స్వామికి ప్రత్యేక అభిషేకం



**బేగంపేట నవంబరు 20,ప్రభాతవవార్త**

కార్తీక మాసం చివరి రోజున సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో ఉన్న శ్రీ వీరభద్ర సహిత శ్రీ మహాకాళేశ్వర స్వామి కి 108లీటర్ల పాలు,పండ్లతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.గురువారం అమావాస్య సందర్భంగా అమ్మ వారి దేవస్థానంలో రుద్రహోమం నిర్వహించారు.ఈ పూజలు,హోమంలో పాల్గొనేందుకు జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించారు.రుద్రహోమం,పాలు పండ్లతో చేసిన అభిషేకం కార్యక్రమంలో ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేసారు.కార్తీక మాసం చివరి రోజు కావడంతో ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మ వారు,స్వామి వార్లకు పూజలు చేసారు.అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాల వితరణ చేసారు.అమావాస్య సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండటంతో ఈ ఓ మనోహర్ రెడ్డి,ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్స్ ఆధ్వర్యంలో ఆలయంలో పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేసారు. సాయంత్రం సమయంలో పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు.

### శ్రీరామలింగేశ్వర దేవాలయంలో అన్నాభిషేకం



శ్రీరామలింగేశ్వర దేవాలయంలో పూజల్లో పాల్గొన్న కౌండిన్య శ్రీనివాస్ హేమసుందరి దంపతులు.

**బేగంపేట నవంబరు 20,ప్రభాతవార్త**

కార్తీక మాసం లో భాగంగా గురువారం అమావాస్య ను పురస్కరించుకొని బేగంపేట ప్రకాశంనగర్ లోని శ్రీరామలింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమావాస్య సందర్భంగా అన్నాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌండిన్య శ్రీనివాస్,హేమసుందరి దంపతులు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.కార్తీక మాసంలో భాగంగా ఆలయంలో జరిగిన పూజల సందర్భంగా కౌండిన్య శ్రీనివాస్ దంపతులు అన్నదానం నిర్వహించారు.ఆలయంలో జరిగే పూజల సందర్భంగా తమకు తోచిన విధంగా భక్తులకు అన్నదానం చేయడం తమకెంతో సంతోషంగా ఉందని వారు తెలియజేసారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు మఠం సదాశివుడు నేతృత్వంలో కార్తీక పూజలు నిర్వహించారు.పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్ధ ప్రసాదాల వితరణ చేసారు.

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.విశ్వం మృతి విచారకరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



బీజేపీ రాష్ట్ర నాయకులు విశ్వం పార్థీవదేహంకు నివాళులర్పిస్తున్న బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త:** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.విశ్వం అకాల మరణం విచారకరమని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం సాయంత్రం అనారోగ్యంతో చికిత్స పొందుతూ నాంపల్లి కేర్ హాస్పటల్‌లో మృతి చెందిన బీజేపీ సీనియర్ నేత విశ్వం పార్ధవదేహాన్ని గురువారం ముషీరాబాద్‌లోని ఆయన స్వగృహంలో పలువురు నేతలు సందర్శించి, నివాళులర్పించి, ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలియచేశారు.నివాళులర్పించిన వారిలోహర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు,బీజేపీ నేతలు పాల్గొన్నారు.

## శ్రీశైలం గౌడ్‌కి పలు ఆహ్వానాలు అందజేత



ఆహ్వానాలు అందజేస్తున్న దృశ్యం

**పేట్ బషీరాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద రోజువారి కార్యక్రమంలో భాగంగా గురువారం నియోజకవర్గం నాయకులు, అయ్యప్ప స్వాములు మాజీ ఎమ్మెల్యేని కలిసి ఆహ్వానాలను అందజేయడం జరిగింది. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

### భవన్స్‌లో చేర్యాల బొమ్మలతో కాటమరాజు కథ

**జుబ్లీహిల్స్, నవంబరు 20, ప్రభాతవార్త:** భారతీయ విద్యాభవన్స్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్(విద్యాశ్రమం) లో గురువారం చేర్యాల బొమ్మలతో కాటమరాజు కథ కార్యక్రమాన్ని నిర్వహించారు. చేర్యాల బొమ్మలపై దాదాపు 14 ఏళ్ల పాటు పరిశోధన అంశాలు, కాటమరాజు కథ, ఆచార పద్దతులు, వాటితో ముడిపడి ఉన్న శాస్త్రాలు, సామాజిక అనుసంధానం తదితర అంశాలను ఇక్కడ క్రాఫ్ట్ రివైవలిస్ట్,డిజైనర్ రామనాథం రమేష్ విద్యార్థులకు వివరించారు. చేర్యాల బొమ్మలను ఉపయోగించి వలురాజు, మల్లమ్మ కథలను సైతం చెప్పారు. పిల్లల కోసం వల్లమ్మ శివుడిని ఎలా ప్రార్థిస్తుందో, అయిదుగురు కుమారులు, ఒక కుమార్తెను ఇవ్వమని వల్లమ్మ ఎలా ఒప్పించిందో రామనాథం రమేష్ బొమ్మలతో కళాత్మకంగా వివరించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన చరిత్రను విద్యార్థులకు తెలియజేయవచ్చని పాఠశాల ప్రిన్సిపల్ అరుణ శ్రీ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులపై సూపర్వైజర్ల పెత్తనం అరికట్టాలి

### - ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్



కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న పాలబిందెల శ్రీనివాస్

**నిజాంపేట్, నవంబర్ 20, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేసే సిబ్బందిని, కార్మికులను కొంత మంది సూపర్వేజర్లు ఇబ్బందులకు గురించేస్తున్నారని , సూపర్వేజరులు పెత్తనం అరికట్టాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షబ్బీర్ అలీ, శానిటైజర్ ఇంచార్జ్ జయ్‌రాజ్‌కి పిర్యాదు చేయడం జరిగింది. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతు గతంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మూడు గ్రామాలుగా ఉండేదని అప్పుడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కార్మికులు పని చేసే వారని, వారికీ ఆ గ్రామపంచాయితీ జీతాలు ఇచ్చేదని గుర్తు చేశారు. అప్పుడు కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చిన కార్మిక సంఘం పేర్లు ఏదైనా బాచుపల్లి, ప్రగతినగర్‌లో చల్ల.సుధీర్ రెడ్డి, నిజాంపేట్ ఆశి. యాదయ్య, నాయకత్వం వహించేదన్నారు. వారి నాయకత్వంలో కార్మికులు సిబ్బంది పని చేసే వారని అన్నారు. ఇప్పుడు ఉమ్మడి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు అయినా తరువాత కొంత మంది స్వార్థ రాజకీయాల కోసం అనేక విధాలుగా కార్మికులకు, సూపర్వేజర్లు, వార్డు ఆఫీర్సలు ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. నేటికీ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అందరిని కలుపుకొని అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామని, అందుకే కార్మికలకు ఇబ్బంది కల్పించే సూపర్వేజర్లను, ఇతరులను బదిలీ చేయాలనీ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఏఐటీయూసీ మున్సిపల్ అధ్యక్షులు ఆశి. యాదయ్య, పొన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

This Serves as a General Public Notice regarding a property that my client **Mrs. QAISER BEGUM W/o MOHAMMED YOUSUF,** R/o H.No.11-4-345, Chilkalguda, Secunderabad-500061, who is purchasing the house bearing MCH No.6-1-172/17 (PTI No. 1180608434) adm.70.0 Sq.yds. or 58.12 Sq.mtrs., with 465 Sq.ft (ACC) situated Sri Venkateswara Nagar, padmarao Nagar, Chilkal guda, Sec'bad, through the registered Sale Deed vide Doct No.3022/1993, dt 04.11.1993 at Joint R.O. Hyderabad from **Mrs. RAJA BALA alias RAJ BALA W/o GOBIND PRAKASH,** R/o H.No. 6-1-172/17, Chilkalguda, Venkateswara Nagar, Sec'bad.
If any objections on the above said property contact us within **One Week.**

**Sd/- E. SURESH KUMAR**
**Advocate**
**High Court of Telangana**
Eden Enclave Apts, Vidya Nagar, Adikmet, Hyd-44. **Cell: 9052604135**

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

నిట్ నెం: 34/EE/CIRCLE No.12/KZ/GHMC/2025-26, తేది: 19.11.2025.
పని పేరు : పొరసొకర్యాల ఏర్పాటు స్మశాన వాటిక పనులు. అంచనా మొత్తం/ECV : రూ.3.90 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ చివరి తేదీలు మరియు సమయం : ప్రారంభం : 20.11.2025, మ.1.00గం. వద్ద నుండి/ముగింపు: 23.11.2025 మ.1.00గం. వరకు. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-12, KZ, GHMC, ఖైరతాబాద్, ఫోన్: 9989930651. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. కమిషనర్ GHMC.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-12 (K.Z), GHMC.
DIPR.NO.11047-PP/CL/ADVT/1/2025-26 తేది: 20.11.2025

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE, R.R. DISTRICT, AT :: L.B.NAGAR**
**O.S. No. 362 OF 2025**
**BETWEEN:**
Sri KURAKULA GAJENDRA MOHAN & OTHERS ...PLAINTIFFS
AND
Smt.KURAKULA SHANTA & others ... DEFENDANTS
TO
1. Smt.ANURADHA PADIGE @ Smt.K.ANURADHA, Wife of Srinivas Padige, aged about 53 years, Occ: Business, permanent resident of H.No.3-3-532, Quthbiguda, Kachiguda, Hyderabad, T.G.-500027.
2. Smt.INDIRA HANMANTH, Wife of Mr.Sridher Rao Hanmanth, aged 50 years, Occ Housewife, Resident of H.No.3-3-532, Quthbiguda, Kachiguda, Hyderabad, T.G-500027.

Whereas the Plaintiffs herein have filed a suit for Declaration to declare the plaintiffs are the absolute owners and possessors of the suit schedule properties (Premises bearing Nos. 11-10-298/2, 11-10-298/2/A, 11-10-298/2/B, 11-10-298/3/G2/A, 11-10-298/3/105, 11-10-298/3/204, 11-10-298/3/205, 11-10-298/3/403, situated at APSEB Employees Co-Operative Housing Society Limited, (Regd. No.T.B.62), Vijayapuri Colony, Saroor Nagar Village, R.R. District) detailed in the plaint in O.S. No.362/2025 against you & others. The Hon'ble Court has ordered service of notice by way of paper publication against you i.e. the Defendant Nos.3 & 4 in O.S. No.362/2025.

Please take notice that the above case now stands posted to 22-12-2025 for your appearance. If you fail to appear before the above said Court at 10-30 a.m. on 22-12-2025, either in persons or through an Advocate, you will be set exparte and an exparte Order will be passed against you.
(BY ORDER OF THE COURT)
Sd/- (MANU)
Advocate
Premises No. 10-3-174, St. John's Road, Sec'bad. **Cell No. 98481-35219.**

**IN THE COURT OF THE IVth ADDL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT :: AT L.B.NAGAR**
**E.P. NO. 1191 OF 2019**
**IN**
**AOP NO 441 OF 2013**
**Between -**
M/s Rank Silicon Private Limited ...Decree-Holder
AND
M/s Maytas Hill County Residence private Limited & Another .. Judgment Debtors
To
JDR No -1
M/s Maytas Hill County Residence private Limited O/c at Maytas Hill County, Bahupally, Hyderabad, Rep-director Mr Neerav Kapasi, S/Mr Yashwant Aged about 42 years
Please take notice that the above named Decree holder filed above Execution petition No 1191 of 2019 in A.O.P No 441 of 2013 to attach the immovable property of JDR No1 mentioned in the E.P Schedule property O/U 21 Rule 54 of CPC and put to proclamation of sale by public auction O/U 21 Rule 66 of CPC towards satisfaction of the decree and the proceeds of such sale thereof shall be paid to the decree holderand you are hereby summoned to appear in person or through pleader duly instructed on 19-12-2025 at 10-30 A.M. before the Hon'ble Court. Take notice that, in default of your appearance on the day above mentioned ,the E.P will be heard and determined in your absence.
// By Order of Court //
Sd/ K.SRINIVASA REDDY
ADVOCATE,
Flat No.401, No 16-2-751/55/21, SBH Colony, GA-2 Saidabad, Gddianaram, Hyderabad.

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT: HYDERABAD**
**S.A. No.74 of 2025**
Between:
Bharat ITI, Represented by Its Principal, Mr. S.Rajashekar Reddy ...Applicant
AND
Vardhaman Bank
(Vardhaman (Mahila) Co-operative Urban Bank Limited) Represented by CEO & Authorised Officer & Others ...Respondents
To,
1. M/s. Graphic Systems
Represented by its Managing Partner Mr. Netaji # 4-1-882/1/7, 1st Floor, Reddy Hostel Shopping Complex, Tilak Road, Abids, Hyderabad, 500001. T.S ...Respondent No.2
2. M/s. Sri Priyanka Enterprises
Represented by its Managing Partner, Mr. Netaji, #4-1-882/1/7, 1st Floor, Reddy Hostel Shopping Complex, Tilak Road, Abids, Hyderabad - 5000001 T.S. ...Respondent No.3
3. M/s. Sri Priyanka Graph Tech Pvt Ltd.,
Represented by its Managing Director Sri M. Netaji, #Plot No. 48/B, Phase-1, Sy.No. 257, IDA Jeedimetla Village, Jeedimetla Mandal, Quthbullapur, R.R.Dist - 500055. ...Respondent No.4
**NOTICE**
Please take notice, that the above named applicant has filed the above S.A. No.74 of 2025 before the Hon'ble Debts Recovery Tribunal - II, Hyderabad and you are arrayed as Respondents No.2, 3 & 4 in the said proceedings. The Hon'ble Tribunal directed to serve the notice to the Respondents and posted the matter to **19-12-2025.** This is for your information and notice for your appearance. In case you fail to appear, the matter shall be heard in your absence.
By order of the
Honourable Debts Recovery Tribunal - II, 1st Floor,Triveni Complex, Abids, Hyderabad.
RAJA SHEKAR RAO SALVAJI, ADVOCATE
COUNSEL FOR APPLICANT

**IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE AT MEDCHAL**
**O.S.No.702 OF 2025**
**Between:**
1. Gopishetti Ananthalaxmi
2. Gopishetti Raj Kumar
3. Gopishetti @ Medipalli Annapurna ... Plaintiffs
And
1. The State of Telangana., through District Collector, Medchal Malkajgiri District
2. The Branch Manager, Life Insurance Corporation of India At Hyderabad
3. To whomsoever it may concern. ... Defendants
**NOTICE**
TO,
To whom so ever it may concern
Take notice that the above O.S is posted on 20-01-2026 The petitioners herein filed the above case to issue grant of permission to sell or otherwise to deal with the properties,, Hence, if any person is having any objection in favour of the petitioner is required to appear before the Hon'ble Court either in per- son or through counsel on 20-01-2026 at 10.30 a.m. failing which the matter will be heard and decided as exparte
Hence this notice.
//BY THE ORDER OF THE COURT //
G PRASHANTH
ADVOCATE
H.NO.25-11-166,
Bapuji nagar
Kazipet, Hanamkonda.

**IN THE COURT OF THE HONBLE PRL.SENIOR CIVIL JUDGE, MEDCHAL - MALKAJGIRI DISTRICT AT: MEDCHAL**
**I.A.NO. 508 OF 2024**
**IN**
**O.S.NO. 2893 OF 2006**
Between:-
Boorgubavi Chinna Pentaiah and others ...Plaintiffs
And
Boorgubavi Ramulu and others ...Respondents
**NOTICE**
To,
1. Laxmidevi Shankaraiah S/o. Anthaiah Aged about 65 years Occ. Milk Business (R-2).
2. Laxmidevi Sharnantha W/o. Shankaraiah Aged about 56 years Occ: House-wife (R-3) Both are R/o.H.No.2-26, Doolapally Village, Gandimaisamma Dundigal Mandal, Medchal malkajgiri Dist.
3. Akula Bharathi D/o. Ramulu W/o.Shankaraiah Age: 54 years R/o. Dundigal Village, Gandimaisamma Dundigal Mandal, Medchal Malkajgiri Dist. (R-9)
Please take notice that my clients Boorgubavi Chinna Pentaiah S/o. Pedda Mallaiah @ Garise Pedda Mallaiah and others filed Petition Under order xxvI Rule-13 R/w sec. 151 of C.P.C. to appoint an Advocate Commissioner to measure the schedule property with the help of Mandal Surveyor of Quthbullapur Mandal, Medchal - Malkajgiri District, against Respondents by names Laxmidevi Shankaraiah and others, but you are avoided to take notice, as such instead of court notice herewith sending Notices through this publication to said Respondents No.2,3 and 9 and the said case is posted for your appearance on dt: 03-12-2025 at 10-30 A.M. in above said court and make it convenient and appear personally or through your counsel, otherwise the matter will be decided on merits.
// BY ORDER OF THE COURT //
(CH.DASHARATHA)
ADVOCATE
H.No. 13-271/4,P10t No.48, Sy.No.87, Chandranagar colony, Beside Royal Function Hall, Medchal Village and Mandal, Medchal - Malkajgiri Dist
Cell: 94404-38548

**IN THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE, MEDCHAL - MALKAJGIRI DISTRICT AT: MEDCHAL**
**I.A.NO. 509 OF 2024**
**IN**
**O.S.NO. 2893 OF 2006**
Between:-
Boorgubavi Chinna Pentaiah and others ...Plaintiffs
And
Boorgubavi Ramulu and others ...Respomdents
**NOTICE**
To,
1. Laxmidevi Shankaraiah S/o. Anthaiah Aged about 65years Occ:Milk Business(R-2)
2. Laxmidevi Shamantha W/o. Shankaraiah Aged about 56 years Occ:House-wife (R-3) Both are R/o.H.No.2-26, Doolapally Village, Gandimaisamma Dundigal Mandal, Medchal-Malkajgiri Dist.
3.Akula Bharathi D/o. Ramulu W/O.Shankaraiah, Age about: 54 years R/o. Dundigal Village, Gandimaisamma Dundigal Mandal, Medchal-Malkajgiri Dist.(R-9)
Please take notice that my clients Boorgubavi Chinna Pentaiah S/o. pedda Mallaiah @ Garise Pedda Mallaiah and others filed Petition Under Order XX Rule_18 R/w Sec. 151 of C.P.C. to fix the boundry stones and allot half share to Plaintiff No. 1 Chinna Pentaiah and half share to the Legal Heirs of Boorgubavi Ramulu and grant final decree to the respective shares and also delivered peaceful possession to the respective parties in the above said case before the Hon'ble Court and as per orders Of the Hon'ble Court, notices sent to you the Respondents/ Defendants NO.2,3 and 9 but you are avoided to take notice, as such instead of court notice herewith sending summons through this publication to said Respondents No.2,3 and 9 by and the said case is posted for your appearance on dt: 03-12-2025 at 10-30 A.M. in above said court and make it convenient and appear personally or through your counsel, otherwise the matter will be decided on merits.
// BY ORDER OF THE COURT //
(CH.DASHARATHA)
ADVOCATE
H.No. 13-271/4,P10t No.48, Sy.No.87, Chandranagar colony, Beside Royal Function Hall, Medchal Village and Mandal, Medchal - Malkajgiri Dist
Cell: 94404-38548

